జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 155 శుక్రవారం 31 అక్టోబరు– 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.



## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్,

# ప్రతి నెల జాబ్ మేళాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు

## నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం

**శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధృవపత్రాల జారీ**

**ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం**

**నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి, అక్టోబర్ 30(సందేశం టైమ్స్) :యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ,

ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు.

2లో

## ఏఐతో అదరగొట్టిన గూగుల్..

# ఆదాయంలో ఆల్ టైమ్ రికార్డ్!

**చరిత్రలో తొలిసారి 100 బిలియన్ డాలర్ల త్రైమాసిక ఆదాయాన్ని ప్రకటించిన ఆల్ఫాబెట్**

సెర్చ్, యూట్యూబ్, క్లౌడ్ విభాగాల్లో రెండంకెల వృద్ధి నమోదు

జెమినీ యాప్‌కు 650 మిలియన్లకు పైగా నెలవారీ యాక్టివ్ యూజర్లు

ఏఐ ఆధారిత సేవలతో గణనీయంగా పెరిగిన గూగుల్ సెర్చ్ ప్రశ్నలు

క్లౌడ్ బ్యాక్‌లాగ్ 155 బిలియన్ డాలర్లకు చేరినట్టు వెల్లడించిన పిచాయ్

300 మిలియన్లు దాటిన గూగుల్ వన్, యూట్యూబ్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్లు



మిగతా 2లో...

## డైవర్షన్ కోసమే వైసీపీ కుట్ర: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



అమరావతి, అక్టోబర్ 30(సందేశం టైమ్స్) : తనను లక్ష్యంగా చేసుకుని వైసీపీ చేస్తున్న ఆరోపణలను మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు ఎంఎస్ రాజు గురువారం అమరావతిలో ఖండించారు. భగవద్గీతను తాను అవమానపరిచినట్లు వైసీపీ అసత్య ప్రచారం చేస్తుందని మండిపడ్డారు. రాజ్యాంగం వల్ల దళితుల జీవిత ప్రమాణాలు మెరుగుపడ్డాయని తాను వ్యాఖ్యానించానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మొంథా తుపాన్ ప్రభావంతో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్నసేవలను డైవర్ట్ చేసేందుకే వైసీపీ ఈ తరహా కుట్రకు తెర తీసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాను దళిత హిందువునని.. కానీ భూమన కరుణాకర్ రెడ్డిలాగా ఇంట్లో ఒక మతం, బయట పదవుల కోసం మరో మతం ఆచరించే వ్యక్తిని కాదంటూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పష్టం చేశారు. అయినా తాను చేసిన వ్యాఖ్యలకు హిందువుల మనోభావాలు దెబ్బతిని ఉంటే ఒక హిందూ సోదరుడిగా అందరికీ క్షమాపణలు చెబుతున్నానని ఆయన ప్రకటించారు.

## ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన నీరు.. అధికారులు అప్రమత్తం



మిగతా 2లో...

## వరి పొలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం



అమరావతి, అక్టోబర్ 30(సందేశం టైమ్స్) : గత మూడు రోజులుగా కురిసిన వానలకు కృష్ణా జిల్లా కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని కృష్ణాపురం ఆర్.సి.యం చర్చి వద్ద తుఫాన్ దాటికి వరి పొలాలు పడిపోయాయి. ప్రభావిత ప్రాంతాలను ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించి రైతులతో మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలసౌరి, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు.

## తుఫాను బాధితులకు

## నిత్యవసరాల పంపిణీలో పాల్గొన్న మంత్రి మనోహర్



అమరావతి, అక్టోబర్ 30(సందేశం టైమ్స్) : మొంథా తుఫాన్ ప్రభావంతో పట్టణంలో అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో తలదాచుకున్న పేదలకు గురువారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న మంత్రి మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో 4,553 పునరావాస కేంద్రాలలో 9,451 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. పట్టణంలో 8 పునరావాస కేంద్రాలలో ఉన్న 615 మందికి 25 కేజీల చొప్పున బియ్యం, కూరగాయలు, సరుకులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ, తహసిల్దార్ కెవి గోపాలకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, కమిషనర్ బి రామ అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆ వాట్సాప్ మెసేజ్‌తో జాగ్రత్త..



అమరావతి, అక్టోబర్ 30(సందేశం టైమ్స్) :ఏపీలో కొత్త రకం సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. "ఆర్‌టీవో చలాన్" పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా మెసేజ్‌లు షేర్ అవుతున్నాయి. ఈ మెసేజ్‌లతో పాటు ఒక "ఆర్‌టీవో చలాన్ ఏపీకే" ఫైల్‌ను పంపిస్తూ వాహనదారులను టార్గెట్ చేస్తున్నారు. "మీ వాహనంపై ఈ–చలాన్ నమోదైంది, వెంటనే చెక్ చేయకపోతే కోర్టులో ఎఫ్ఐఆర్ దాఖలవుతుంది" అనే బెదిరింపు సందేశంతో ప్రజలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆ ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే ఫోన్‌లోని కాంటాక్టులు, మెసేజ్‌లు వంటి సమాచారం హ్యాకర్లకు చేరిపోతోంది. ఇంకా, ఆ ఫోన్ నుంచి ఇతర కాంటాక్టులకు కూడా అదే మాల్వేర్ ఆటోమేటిక్‌గా షేర్ అవుతోంది.

## అపార పంట నష్టం.. బాధితులకు అండగా ప్రభుత్వం



మిగతా 2లో...

## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్, ప్రతి నెల జాబ్ మేళాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు

ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అన్నారు.

గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.

క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేశ్

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేశ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు.విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను తీర్చిదిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలో ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు.అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్‌ను సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు.

## ఏఐతో అదరగొట్టిన గూగుల్.. ఆదాయంలో ఆల్ టైమ్ రికార్డ్!

టెక్ దిగ్గజం, గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ చరిత్ర సృష్టించింది. తన చరిత్రలో తొలిసారిగా ఒకే త్రైమాసికంలో 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.80 లక్షల కోట్లు) ఆదాయాన్ని సాధించి సరికొత్త రికార్డు నమోదు చేసింది. సెర్చ్, క్లౌడ్, యూట్యూబ్ సహా అన్ని కీలక విభాగాల్లోనూ బలమైన రెండంకెల వృద్ధిని సాధించడం వల్లే ఇది సాధ్యమైందని ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటించారు.కంపెనీ 2025 మూడో త్రైమాసిక (%ు%3) ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా సుందర్ పిచాయ్ ఈ వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "జెమినీ యాప్ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 650 మిలియన్లు దాటింది. గత త్రైమాసికంతో పోలిస్తే జెమినీపై వచ్చే ప్రశ్నలు మూడు రెట్లు పెరిగాయి" అని వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ కంపెనీ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన స్పష్టం చేశారు.క్లౌడ్ విభాగం అద్భుతమైన పనితీరు కనబరిచిందని, ఏఐ ఆధారిత ఆదాయం దీనికి ముఖ్య కారణమని పిచాయ్ అన్నారు. "క్లౌడ్ బ్యాక్‌లాగ్ గత క్వార్టర్‌తో పోలిస్తే 46 శాతం పెరిగి 155 బిలియన్ డాలర్లకు చేరింది. అలాగే గూగుల్ వన్, యూట్యూబ్ ప్రీమియం వంటి పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 300 మిలియన్ల మార్కును దాటింది" అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 40 భాషల్లో ప్రారంభించిన 'ఏఐ మోడ్'కు రోజూ 75 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారని, ఇది సెర్చ్ ప్రశ్నల పెరుగుదలకు దోహదపడుతోందని ఆయన పేర్కొన్నారు.గూగుల్ సర్వీసెస్ ఆదాయం ఈ త్రైమాసికంలో 14 శాతం వృద్ధితో 87 బిలియన్ డాలర్లకు చేరిందని గూగుల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్ తెలిపారు. సెర్చ్, యూట్యూబ్ విభాగాల్లో నమోదైన వృద్ధి దీనికి కారణమని చెప్పారు. గూగుల్ సెర్చ్ ఆదాయం 15 శాతం పెరగ్గా, రిటైల్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలు ప్రధాన పాత్ర పోషించాయని వివరించారు.

## అపార పంట నష్టం.. బాధితులకు అండగా ప్రభుత్వం

అనంతపురం: మొంథా తుఫాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. తుఫాన్ గురించి ప్రధాని మోదీ స్వయంగా ఆరా తీశారని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన ఇవాళ(గురువారం) మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అపార పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి, పంట నష్టం అంచనాలకు సర్వే బృందాలు పని చేస్తున్నాయని వివరించారు. పంట నష్టం జరిగిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు.మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద సాయం అందేలా చర్యలు చేపడుతున్నట్లు అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. బీమా, లోన్ సౌకర్యాలు పథకంలో ఉన్నాయని తెలిపారు. మత్స్యకారులను అన్ని విధులుగా ఆదుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఫసల్ బీమా యోజన రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలయ్యే లాగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వం దీనిని సక్రమంగా అమలు చేయలేక ఇబ్బందులు తలెత్తాయని ఆరోపించారు. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు తమ పార్టీ తరఫున ఓ నోట్ తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తామని మాధవ్ వెల్లడించారు.

## ప్రకాశం బ్యారేజీకి పోటెత్తిన నీరు.. అధికారులు అప్రమత్తం

అమరావతి, అక్టోబర్ 30: మొంథా తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటితో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకు వరద పోటెత్తింది. గురువారం బ్యారేజీకు 4.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. ఈ నేపథ్యంలో బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఉన్నతాధికారులు జారీ చేశారు. అయితే గురువారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద వరద నీరు మరింత వచ్చి చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ సాయంత్రానికి 6 లక్షల క్యూసెక్కులకు వరద నీరు చేరే అవకాశం ఉందని అంటున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు




హైదరాబాద్ : మొంథా తుపాను ప్రభావంతో వరంగల్, హనుమకొండ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరద పరిస్థితులను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు సమీక్షించారు. వరద బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ముఖ్యమంత్రి గారు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారిని, రాష్ట్ర డీజీపీ గారిని ఆదేశిస్తూ %-% వరద ప్రభావిత ప్రాంతాలకు వెంటనే పడవలను పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సూచించారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో పరిస్థితులపై మంత్రులు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి గారు, అత్యవసర ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. హైడ్రా సిబ్బంది మరియు హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామగ్రిని వినియోగించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెంటనే తరలించాలని, ఇండ్ల కప్పులు లేదా బంగ్లాల్లో చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా ఆహారం, మంచినీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సహాయక చర్యలను కొనసాగించాలని, ప్రాణనష్టం జరగకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఈరోజు తలపెట్టిన వరంగల్ జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్న ముఖ్యమంత్రి గారు గురువారం రోజున వరంగల్, హుస్నాబాద్ తదితర ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

## సింగూరు ప్రాజెక్టు ద్వారా దిగువకు నీటి విడుదల

**ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917**

**ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 17.133 టీఎంసీలు**

**ప్రాజెక్టు ఇన్ ఫ్లో 26313. కాగా అవుట్ ఫ్లో.21935. క్యూసెక్కులు**



సందేశం టైమ్స్:-పుల్కల్ మండలం ప్రతినిధి అక్టోబర్ 30 సంగారెడ్డి జిల్లా: ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు ఆయన సింగూరు ప్రాజెక్టు అట్టి ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 17.133 టీఎంసీల నీరు నిల్వ ఉంది ప్రస్తుతం నాలుగు అయిదు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టు ఎగువ భాగం నుండి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు దీంతో ప్రాజెక్టు 12, 14 ,15 నెంబర్ గల గేట్లను సుమారు 1.5 మీటర్ల పైకి ఎత్తి 14 వ గేటు ను రెండు మీటర్లు ఎత్తి 26313 క్యూసెక్కులన్నిటిని దిగువకు వదిలారు ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులు మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి ఎగువ భాగం నుండి అధిక నీరు ప్రాజెక్టులోకి రావడంతో అట్టి నీటిని దిగువకు వదలడం జరుగుతుందని ప్రాజెక్టు అధికారులు అన్నారు కావున దిగువనున్న మాంజీర పరిహాక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు అంతేకాకుండా మంజీరా నది వైపు ముఖ్యంగామత్స్యకారులు గొర్ర కాపరులు. పశు కాపరులు . మాంజీర తీరం వైపు వెళ్ళవద్దని హెచ్చరికలు జారీ చేశారు ఈ క్షణంలోనైనా ప్రాజెక్టులో నీటి నిలువ పెరిగే అవకాశాలు ఉన్నాయని కావున ఇవ్వనున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు అన్నారు. దీంతో ప్రాజెక్టు అధికారులు ప్రతి గంట గంటకు నీటి ప్రవాహాన్ని గుర్తిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

## మంజీరా నదిలో గుర్తు తెలియని మగ మనిషి మృతదేయం






సందేశం టైమ్స్:అందోల్ నియోజకవర్గ ప్రతినిధి31అక్టోబర్ సంగారెడ్డి జిల్లా: రైకోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మొరట్గా గ్రామ శివారులో ఉన్న మంజీరా నది బ్యాక్ వాటర్‌లో ఈ రోజు (30.10.2025) ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం నీటిలో బోర్లపడి తేలియాడుతూ కనిపించింది.సమాచారం అందిన వెంటనే రైకోడ్ పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు లైట్ బ్రౌన్ (జాజు) రంగు షర్ట్ మరియు నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడు. అతని వయసు సుమారు 35 నుండి 40 సంవత్సరాల మధ్యగా ఉండవచ్చని తెలిపారు.గుర్తు తెలియని మృతుని వివరాలు తెలిసిన వారు లేదా ఆయన కుటుంబ సభ్యులు రైకోడ్ పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

సంప్రదించవలసిన నంబర్లు:
8712656770
8712661852
ఇట్లు, రైకోడ్ పోలీస్.

## రాయికోడ్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 కార్యక్రమం







సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 31అక్టోబర్ సంగారెడ్డి జిల్లా: భారతీయ పత్తి సంస్థ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ-రాయికోడ్ ఆధ్వర్యంలో మునిపల్లి మండలం రైతు వేదికలో "విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025"ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని రైతు సోదరులకు పత్తి పంట అమ్మకం విధానం, అలాగే కొత్తగా ప్రవేశపెట్టిన మరియు స్లాట్ బుకింగ్ సిస్టమ్ గురించి వివరించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పత్తి తేమ శాతం గురించి రైతులకు స్పష్టమైన అవగాహన కలిగించే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు అవేర్‌నెస్ ప్లెడ్జ్ (జాగ్రత్త ప్రమాణం)లో పాల్గొన్నారు.కార్యక్రమంలో చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ కమర్షియల్ ఆఫీసర్ వరుణ్ రఘువీర్, ఆఫీసర్ శివానంద్, రెహమాన్, శక్తివెల్ ఆఫీసర్ తేజ రెడ్డి, సీనియర్ నాయకులు సంగమేశ్వర్, రేగోటి నరేష్, విట్టల్ రెడ్డి, సురేష్, రాజు, రమేష్, %ూవీజ% డైరెక్టర్ మహేష్, అలాగే సోషల్ మీడియా ఇన్‌చార్జ్ . ఖలీం పాషా పాల్గొన్నారు.వివిధ గ్రామాల రైతు సోదరులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా హాజరయ్యారు.

# సంపాదకీయం

## గూగుల్ డేటా సెంటర్ అపోహలు వాస్తవాలు

విశాఖపట్నంలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో డేటా సెంటర్‌ను నిర్మించబోతోందనే వార్తలు వెలువడగానే అనేక ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్షం కూడా ప్రభుత్వంపైన ప్రతికూలంగా స్పందించింది. తద్వారా అసలు 'డేటా సెంటర్' అంటే ఏమిటి? దీని ప్రాధాన్యం ఏమిటి? సమాజానికి దీని అవసరం ఉందా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. మనం యూట్యూబ్‌లో సినిమానో, ఫేస్‌బుక్‌లో రీల్‌నో స్ట్రీమ్ చేసినప్పుడూబీ గూగుల్ పేనో ఫోన్ పేనో చెల్లింపుల కోసం వాడినప్పుడూ, గూగుల్‌నో, చాట్ జీపీటీనో ప్రశ్న అడిగినప్పుడూ, వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపినప్పుడూ... ఈ డేటా అంతా ఎక్కడో ఒకచోట ఉండాలి. ఇది కేవలం 'క్లౌడ్'లో తేలుతూ ఉండదు. ఇది ప్రత్యేకమైన, అత్యంత సురక్షితమైన భవనంలో నెలకొల్పబడిన డేటా సెంటర్‌లో ఉంటుంది. డేటా సెంటర్‌లు కేవలం నిల్వ సౌకర్యాలు మాత్రమే కాదు, అవి మొత్తం డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు పునాదిగా ఉంటాయి. నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారతదేశం ఇంతటి ప్రాధాన్యం గల డేటా సెంటర్ల వ్యవస్థాపనలో టాప్ 10 దేశాల్లో కూడా లేదు. ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ పోటీలో ఇతర దేశాలకు అందనంత ఎత్తులో అమెరికా ఉన్నది. అక్కడ మార్చి 2025 నాటికి 5,426 డేటా సెంటర్లు ఉన్నాయి. అమెరికా తరువాత చైనాలో వేలాది డేటా సెంటర్లు ఉన్నాయి. వాటిలో హైపర్ స్కేల్ డేటా సెంటర్లు 100కు పైగా ఉన్నాయి. అలాగే జర్మనీలో 529, బ్రిటన్‌లో 523, ఫ్రాన్స్‌లో 322, ఆస్ట్రేలియాలో 314, నెదర్లాండ్స్‌లో 298, రష్యాలో 251, ఇటలీలో 173, మెక్సికోలో 168 డేటా సెంటర్లు ఉన్నాయి. డేటా సెంటర్ల నిర్వహణలో విద్యుత్ వినియోగం కీలకం కాబట్టి, వాటిని అవి వినియోగించే విద్యుత్ పరిమాణంతో కొలుస్తారు. 2023లో అమెరికాలోని డేటా సెంటర్‌లు 176 టెరావాట్%-%గంటల (%uఔొష్ట్ర%) విద్యుత్‌ను ఉపయోగించాయి (1 టెరావాట్ గంటలు అంటే 10 లక్షల మెగావాట్ గంటలకు సమానం). ఇది అమెరికా మొత్తం విద్యుత్ వినియోగంలో దాదాపు 4.4శాతం. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ పెరుగుదలతో డేటా సెంటర్ల విద్యుత్ వినియోగం 2030 నాటికి 12శాతానికి పెరగవచ్చు. నీటి వినియోగం కూడా ఎక్కువే. అయితే లిక్విడ్ కూలెంట్ సాంకేతికతతో అది నిర్వహించగలిగే స్థాయిలోనే ఉంటుంది. ఈ లెక్కలను చూసినప్పుడు డేటా సెంటర్ల నిర్మాణంలో అమెరికాకు చేరువగా ఇప్పట్లో ఏ దేశమూ చేరుకోలేదని అర్థమవుతుంది. డేటా సెంటర్ల వ్యవస్థాపనలో భారతదేశం ఎక్కడుంది? భారతదేశం 138 డేటా సెంటర్లతో ప్రపంచంలో 13వ స్థానంలో ఉంది! అదనంగా, 2025 చివరికల్లా 1015 మెగావాట్ల సామర్థ్యంతో 45 కొత్త డేటా సెంటర్‌ల నిర్మాణం జరుగుతోంది. భారతదేశంలో డేటా వినియోగం వేగంగా పెరుగుతున్నది. ప్రపంచ డేటాలో 20శాతం భారతదేశం నుంచే వస్తోంది. జూన్ 2023లో ప్రచురితమైన ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక ప్రకారం... 2028 నాటికి భారతదేశంలో ప్రతి వినియోగదారుడు నెలకు 62 జీబీ డేటాను వాడతాడని అంచనా. ఇది అమెరికా, పశ్చిమ యూరప్, దక్షిణ కొరియా, చైనా వంటి అభివృద్ధి చెందిన మార్కెట్‌లను కూడా అధిగమిస్తుంది. అయినప్పటికీ దేశం ఇప్పటికీ ప్రపంచంలో కేవలం 3 శాతంతో అతితక్కువ డేటా సెంటర్ సాంద్రతగల దేశాల్లో ఒకటిగా ఉంది. భారతదేశంలో క్రియాశీల ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 2025 ముగిసేనాటికి 90కోట్లకు చేరుకుంటుంది. దీనితో పోల్చినప్పుడు 2022లో అమెరికాలో రూ.30కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు మాత్రమే ఉన్నారు. భారతదేశంలోని డేటా సెంటర్లలో ఎక్కువ శాతం ముంబైలో ఉన్నాయి. చెన్నై రెండవ స్థానంలో ఉంది. దేశంలోని ఇతర డేటా సెంటర్ హబ్‌లు బెంగళూరు, హైదరాబాద్, నోయిడా (ఢిల్లీ%-చీజ=%), పూణే, కోల్‌కతా వంటి నగరాలలో ఉన్నాయి. అక్టోబర్ 14న విశాఖపట్నంలో ఒక భారీ హైపర్ డేటా సెంటర్‌ను నెలకొల్పనున్నామని గూగుల్ ప్రకటించింది. ఈ డేటా సెంటర్ 1%-%గిగావాట్ (1000 మెగావాట్లకు సమానమైన) సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అంటే ఇది యావత్ ప్రపంచంలోనే అత్యంత సామర్థ్యం గల డేటాసెంటర్ అవుతుంది. ఇప్పటివరకు అమెరికాలోని నెవేడాలో 660 మెగావాట్ల సామర్థ్యంతో ఒక డేటా సెంటర్ అత్యంత సామర్థ్యం గలదిగా ఉండేది. విశాఖపట్నం డేటా సెంటర్ 12 దేశాలలో విస్తరించిఉన్న 'గూగుల్ గ్లోబల్ నెట్‌వర్క్ ఆఫ్ ఏఐ' సెంటర్లలో భాగం అవుతుంది. రాబోయే అయిదేళ్లలో (2026%-%2030) సుమారు రూ. లక్షా 30వేల కోట్లతో దేశంలో మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) హబ్‌ను విశాఖపట్నంలో గూగుల్ ఏర్పాటు చేస్తుంది. ఏఐ అభివృద్ధికి కేంద్రంగా పనిచేయడంతో పాటు, విశాఖపట్నం ఒక ప్రధాన కనెక్టివిటీ హబ్‌గా మారనుంది. ఎందుకంటే గూగుల్ దాని సబ్ సీ (సముద్రం అడుగున) కేబుల్ మౌలిక సదుపాయాలను అక్కడకు తీసుకువచ్చి, వాటిని దాని ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్‌తో అనుసంధానించనుంది. అంటే గూగుల్ ఏఐ టెక్నాలజీని తీసుకురావడమే కాకుండా, దాని సబ్ సీ కేబుల్, నెట్‌వర్క్ కనెక్టివిటీ హబ్ ద్వారా డిజిటల్ మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తుంది. దీనితో ఆసియా%-%పసిఫిక్ ప్రాంతాలకు ప్రత్యక్ష సంబంధం ఏర్పడటమే కాకుండా, దానితో వచ్చే హై స్పీడ్ ఇంటర్‌నెట్ ఇతర కంపెనీల డేటా సెంటర్లు విశాఖపట్నానికి రావటానికి అవకాశం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో మాత్రమే ఒప్పందం చేసుకున్నప్పటికీ గూగుల్ అదానీ ఎంటర్‌ప్రైజెస్ డేటా సెంటర్ జాయింట్ వెంచర్ సంస్థ అదానీ కోనెక్స్, భారతీ ఎయిర్‌టెల్‌లను వ్యూహాత్మక భాగస్వాములుగా చేసుకుంది. దానితో రూ.85,000 కోట్ల ప్రాజెక్టుల అంచనా రూ. లక్షా 25వేల కోట్లకు పెరిగింది. విశాఖపట్నంలో ప్రత్యేకంగా నిర్మించిన డేటా సెంటర్‌ను సంయుక్తంగా స్థాపించడం, అలాగే గూగుల్‌కు చెందిన కొత్త అంతర్జాతీయ సబ్ సీ కేబుళ్లను హోస్ట్ చేయడానికి అత్యాధునిక కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ )ను ఏర్పాటు చేయడం ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో జరుగుతుంది. దీనితో ఈ డేటా సెంటర్ విస్తృతమైన గ్లోబల్ టెరెస్ట్రియల్, సబ్ సీ ఇన్‌ఫ్రాస్టక్చర్‌లో చేరనుంది. డేటా సెంటర్లు తీవ్ర స్థాయిలో విద్యుత్తును, నీటిని వినియోగిస్తాయి. గూగుల్ డేటా కేంద్రం అత్యంత ఆధునిక లిక్విడ్ కూలింగ్ సాంకేతికతతో నిర్మితమవుతుంది. దీనితో విద్యుత్ ఆవశ్యకతలో 20శాతం తగ్గుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థాయిలో ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే 8,000 మెగావాట్ల సోలార్, 4,083 మెగావాట్ల పవన, ఇతర పద్ధతులతో 500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి జరుగుతోంది. అంతేకాదు, గూగుల్ తన డేటా సెంటర్ అవసరాల కోసం 1000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పడానికి సిద్ధపడింది.

# కూలిన చెట్లు తక్షణమే తొలగింపు

## 24 గంటల్లోనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ యుద్ధప్రాతిపదికన అధికారుల చర్యలు

అక్టోబరు30 (సందేశం టైమ్స్): మొంథా తుఫాన్ తీవ్ర నష్టం కలుగజేసినా.. దానివల్ల ప్రజలకు పెద్దగా అసౌకర్యం కలుగకుండా.. విధ్వంసం మరీ పెరగకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రధానంగా రోడ్లపై చెట్లు ఎక్కడ కూలినా.. అధికారులు తక్షణమే వాటిని తొలగిస్తూ వచ్చారు. ఆయా ప్రాంతాల్లో విరిగిపడిన 380 చెట్లను యుద్ధప్రాతిపదికన తొలగించారు. అలాగే పెనుగాలులు, భారీవర్షాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో.. రాత్రిలోపే అన్ని చోట్లా సరఫరాను పునరుద్ధరించాలని సీఎం గట్టిగా ఆదేశాలివ్వడంతో దాదాపుగా ఆ ప్రక్రియను పూర్తిచేశారు. 24 గంటల్లోపే పునరుద్ధరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చెట్లు పెద్దసంఖ్యలో నేలకూలాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 950 కొబ్బరిచెట్లు, వందల సంఖ్యలో ఇతర చెట్లు విరిగిపడగా... 200 ట్రాన్స్‌ఫార్మర్లు, 600 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. కాకినాడ జిల్లాలో 181 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి.. 49 చెట్లు కూలిపోయాయి. తూర్పుగోదావరి జిల్లాలో 244 విద్యుత్ స్తంభాలు, 26 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా 96 చెట్లు నేలకూలాయి. ఇతర జిల్లాల నుంచి రప్పించిన సిబ్బంది తోడ్పాటుతో, క్రేన్ల సాయంతో అధికారులు చెట్ల తొలగింపు, విద్యుత్ పునరుద్ధరణ పనులు దిగ్విజయంగా పూర్తిచేశారు. తుఫాన్‌కు బాగా ప్రభావితమైన పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు 64 బృందాలను ఏర్పాటు చేశారు. 591 మంది సిబ్బంది సాయంతో 55 ఫీడర్స్(33/11 కేవీ)ను పునరుద్ధరించారు. 94 సబ్‌స్టేషన్లలో ఇబ్బందులను తొలగించి విద్యుత్




సరఫరా కొనసాగించారు. జిల్లావ్యాప్తంగా 426 విద్యుత్ స్తంభాలు దెబ్బ తినగా వాటిలో 242 స్తంభాలను నిలబెట్టారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం తిరుపతి ఎస్‌పీడీసీఎల్ నుంచి 167మందిని రప్పించారు. విశాఖపట్నం జిల్లాలో రెండు గ్రామాలకు కరెంటు నిలిచిపోగా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈదురు గాలులకు అనకాపల్లి జిల్లాలో చెట్లు కూలడం, కొమ్మలు విరిగిపడడంతో 83 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. 31 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అధికారులు, సిబ్బంది వెంటనే వెళ్లి చెట్లను తొలగించి.. స్తంభాలను సరిచేసి, సరఫరాను పునరుద్ధరించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పోల్ టు పోల్ సర్వే చేస్తూ.. తక్షణం విద్యుత్ పునరుద్ధరించాలని విద్యుత్ శాఖ అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. మంత్రి లోకేశ్ ఆయనకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై ఆరా తీశారు.

# తుఫాన్ అనంతర చర్యలు తీసుకోండి: అశోక్



ఇచ్ఛాపురం, అక్టోబరు30 (సందేశం టైమ్స్): తుఫాన్‌లో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ప్రభుత్వం ఆదేశించిందని విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరిగిందో నివేదిక అందజేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. నష్టపోయిన పంటలను అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ దాసరి రాజు, మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎన్. వెంకటరావు, ఎంపీడీవో ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. తుఫాన్ ప్రభావిత మత్స్యకార గ్రామమైన డొంకూరు గ్రామాన్ని బుధవారం ఎమ్మె ల్యే బెందాళం అశోక్ సందర్శించారు. కాజ్‌వే పై నిలిచిలోనుంచి నడుచు కుంటూ వెళ్లి గ్రామస్థుల సమస్యలు తెలుసుకున్నారు. జగన్నా?థపురం గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ ఎం.చిన్నమనాయుడు, టీడీపీ నేతలు పి.తవిటయ్య, ఎన్.కోటి, ఎస్.డిల్లీ, కాళ్ల దిలీప్, ఎన్.జాని తదితరులు పాల్గొన్నారు.

# అనపర్తిలో అగ్నిప్రమాదం




అనపర్తి అక్టోబరు30 (సందేశం టైమ్స్): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరు జగనన్న కాలనీలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీలో నివసిస్తున్న కుక్కల దుర్గాభవాని తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటుంది. సాయంత్రం ఆమె ఇంటి నుంచి పొగలు రావ డం గమనించిన స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే ఒక్క సారిగా ఫ్రిడ్జ్ సిలండర్ పేలడంతో ఆ ప్రాంతమం తా భయందోళనలకు గురయ్యారు. స్థానికులు తలుపులు పగులగొట్టి మంటల ను అదుపు చేశారు. అనపర్తి అగ్నిమాపక సి బ్బంది అక్కడికి చేరుకుని నష్టం అం చనా వేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటి లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిం ది. సుమారు రూ. 50 వేల వరకు ఆ స్తినష్టం ఉంటుం దని అంచనా వే స్తున్నామని, విద్యు త్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమా దం జరిగినట్లు భా విస్తున్నామని ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

# తుఫాన్ నష్టాన్ని లెక్కించండి




తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు30 (సందేశం టైమ్స్): మొంథా తుఫాన్ వల్ల జిల్లాలో జరిగిన నష్టాన్ని లెక్కించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. తుఫాన్ నష్టపరిహార గణన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. బురద, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడంతోపాటు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ఫీవర్ సర్వే చేపట్టాలన్నారు. చెరువులు, కాజ్‌వేలు వద్ద వరద ప్రవాహం తగ్గే వరకు పర్యవేక్షిస్తుండాలన్నారు. గుంతలు ఏర్పడిన చోట రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నిత్యావసర సరుకులు, ప్రతి కుటుంబానికీ రూ.3వేలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరో నాలుగు రోజులు బీచ్‌లు, చెరువుల వద్దకు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు పాల్గొన్నారు.

# తస్మాత్ జాగ్రత్త! వాట్సాప్‌లో వస్తున్న మెసేజ్




విశాఖపట్నం, అక్టోబరు30 (సందేశం టైమ్స్): నగరంలో వాట్సాప్ గ్రూపుల ద్వారా 'ఆర్‌టీఓ చలాన్' పేరుతో ఒక మెసేజ్ వైరల్ అవుతోంది. "మీ వాహనంపై ఈ-చలాన్ జనరేట్ అయింది. వెంటనే చెక్ చేసుకోండి. లేదంటే మీపై కోర్టులో ఎఫ్ఐఆర్ నమోదు అవుతుంది. దీంతో పాటు వచ్చిన 'ఆర్‌టీఓ ఏపీకే'(ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజ్) ఇన్‌స్టాల్ చేసుకొని చలానా చెక్ చేసుకొండి... ఫ్రమ్, ఆర్‌టీఓ ఆఫీస్" అంటూ మెసేజ్ వస్తోంది. దాంతో పాటే 'ఈ-చలాన్ ఆర్‌టీఓ... ఏపీకే' అని వస్తోంది. చలానా ఎక్కడ పడింది?, ఎంత వేశారు?... తెలుసుకోవాలన్న ఆత్రంతో పొరపాటున ఆ అప్లికేషన్ ఓపెన్ చేస్తే ప్రమాదమే. అది అనేక పర్మిషన్లు అడుగుతుంది. అవన్నీ ఓకే చేసుకుంటూ పోతే...'వలంటీర్స్ గ్రూపు' అని ఒకటి ఆటోమేటిక్‌గా మొబైల్‌లో జనరేట్ అవుతోంది. అందులో కూడా ఇదే అప్లికేషన్ వస్తోంది. అది ఆ మొబైల్ నుంచి ఇతర వ్యక్తులకు పంపించకుండానే ఫార్వర్డ్ అవుతోంది. నష్టం ఏమిటంటే... మొబైల్ ఖరీదైనది, మాల్వేర్‌ను అడ్డుకునే శక్తి కలది అయితే ఫర్వాలేదు. లేదంటే వాట్సాప్ హ్యాంగ్ అయిపోతుంది. పనిచేయదు. మరికొందరికి ఫోన్‌లో బ్యాటరీ చాలా త్వరగా డ్రైయిన్ అయిపోతుంది. ఫుల్ చార్జింగ్ చేసినా అరగంటలోనే 20 శాతానికి వచ్చేస్తుంది. వెంటనే సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లి మాల్వేర్‌ను తొలగించి, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయించుకోవలసి వస్తుంది. ఈ క్రమంలో ఫోన్‌లో డేటా పోతుంది. సరైన పాస్‌వర్డ్‌లు లేకపోతే అకౌంట్లో డబ్బులు కూడా మాయమైపోయే ప్రమాదం ఉంది.

# గ్యాస్ ఏజెన్సీల మాయాజాలం

**తనిఖీల పేరుతో దోపిడీ**
**కనెక్షన్‌కు రూ.236 వసూలు**
**మీమంచి కోసమేనంటూ తీపిమాటలు**
**ఐదేళ్లకోసారి రూ.15 కోట్లు లూటీ**
**మరోవైపు రవాణా చార్జీల పేరుతో అదనపు భారం**




అక్టోబరు30 (సందేశం టైమ్స్):జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు తప్పనిసరి తనిఖీల పేరుతో ఘరానా దోపిడీకి తెగబడుతున్నాయి. తనిఖీలు చేపట్టకుండానే, వినియోగదారులకు అవగాహన కల్పించకుండానే ముక్కుపిండి వసూలు చేసిన మొత్తానికి రశీదు చేతిలోపెట్టి మమ అనిపిస్తున్నాయి. ఈ రూపేణా ఏటా జిల్లాలో మూడుకోట్ల రూపాయలకు పైగా లూటీ చేస్తున్నాయి. మరోవైపు డోర్ డెలవరీ ముసుగులో బండపై రూ.30 నుంచి 50 రూపాయల వరకూ వసూలు చేస్తున్నాయి. ఈ విధంగానూ కోట్ల రూపాయల భారాన్ని వినియోగదారులపై మోపుతున్నాయి. వినియోగదారుల అవగాహన రాహిత్యం, అవసరం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బరితెగిస్తున్నాయి.జిల్లావ్యాప్తంగా వివిధ గ్యాస్ కంపెనీలకు చెందిన 36 గ్యాస్ ఏజెన్సీల పరిధిలో 7 లక్షల 4 వేల 273 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఐదేళ్లకోసారి ఆయా గ్యాస్ ఏజెన్సీలు తప్పనిసరి తనిఖీలు పేరుతో సిబ్బందిని పంపి ఒక్కో గ్యాస్ కనెక్షన్ వినియోగదారునుంచి రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారు. స్టేట్, సెంట్రల్ జీఎస్టీలు కలిపి రూ.36 దీనికి అదనం. మొత్తం రూ.236 వంతున వసూలు చేస్తున్న సిబ్బంది ఆ మేరకు రశీదు ఇచ్చి వెళ్లిపోవడం తప్ప తనిఖీ ఊసే ఉండదు.వినియోగదారుని చిరునామా ప్రకారం గ్యాస్ కనెక్షన్ పొందిన వారే వినియోగిస్తున్నారా, ఇతరులా అన్నది కచ్చితంగా తనిఖీ చేయాల్సి ఉంటుంది. అలాగే రెగ్యులేటర్, ట్యూబ్ వ్యాలిడిటీ, స్టవ్ బర్నర్లలో లోపాలు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా స్టవ్‌ను అమర్చారా లేదా? అనే విషయాల్ని పరిశీలించడమే కాకుండా విద్యుత్ స్విచ్చుల సమీపంలో సిలిండర్లు ఏర్పాటు చేయకుండా చూడాలి. అలాగే సిలిండర్లు లీకేజీలను కూడా తనిఖీ చేసి వివరాలను యాప్‌లో నమోదు చేసి కంపెనీకి నివేదించాల్సి ఉంటుంది.ఫ ఆయిల్ కంపెనీలు పబ్లిక్ లయబిలిటీ పాలసీ ఫర్ అయిల్ ఇండస్ట్రీస్ పేరుతో ఎల్పీజీ వినియోగదారులకు గరిష్ఠంగా రూ.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందిస్తున్నాయి. ఈపథకం పొందేందుకు మానవ తప్పిదం లేకుండా ఉండేలా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి గ్యాస్ వినియోగదారులు తప్పనిసరి తనిఖీ చేయించుకోవాలని నిబంధన తెచ్చారు. అయితే ఈ విషయాలను వినియోగదారులకు విపులంగా వివరించాల్సిన బాధ్యతను తనిఖీ సిబ్బంది గాలికొదిలేసి డబ్బు తీసుకొని రసీదువరకు మాత్రమే పరిమితమవుతున్నారు. కనీసం ఇంట్లో గ్యాస్ స్టవ్ ముఖం కూడా చూడరు.

# మా అమ్మను కాపాడండి



నంద్యాల టౌన్, అక్టోబరు30 (సందేశం టైమ్స్): తల్లిని తన తండ్రి హింసిస్తున్నాడని ఏడుస్తూ ఏడేళ్ల బాలుడు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన నంద్యాలలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సాయిబాబనగర్‌కు చెందిన జయమ్మ భర్త రాంభూపాల్ వేధింపులు తాళలేక ఆత్మహత్నా యత్నానికి పాల్పడింది.దీంతో స్థానికులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి రాంభూపాల్ ఆసుపత్రి వద్దకు వచ్చి కూడా తల్లిని వేధిస్తుండడంతో తట్టుకోలేని ఏడేళ్ల చిన్నారి బాలుడు ప్రభుత్వాస్పత్రి నుంచి నేరుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తండ్రి రాంభూపాల్‌పై ఫిర్యాదు చేశాడు. పోలీసులు స్పందించి రాంభూ పాల్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు. చిన్నారిని తల్లి వద్దకు చేర్చారు.

# మిశ్రమ పంటల సాగుతో అధిక లాభం

కోడుమూరు రూరల్, అక్టోబరు30 (సందేశం టైమ్స్):మిశ్రమ పంటలు సాగు చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా శిక్షణ కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు సూచించారు. ప్యాలకుర్తిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. తుఫాన్ వచ్చినా మిశ్రమపంటల సాగుతో నష్టం ఉండదన్నారు. కందిలో పూత రాలకుండా మల్టీకే, గూడుపురుగు నివారణకు డెల్టామెత్రిన్ ఎకరాకు 100 మి.లీ.ల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. శనగలో తేమశాతం పెరిగి ఎండుతెగులు వచ్చే ప్రమాదం ఉందని, నివారణకు బ్లైటాక్‌ను,



వేరుశనగలో పచ్చ, లద్దెపురుగు నివారణకు నువాలురాన్, ఇండికాటార్బ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 200 కి.గ్రా జిప్సం వేయడం మూలంగా అధికవేర్లు వచ్చి దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసా యాధికారులు రవిప్రకాష్‌గౌడ్, వెంకటరంగా రెడ్డి పాల్గొన్నారు.

# గోనె సంచులకు నిప్పు



**రూ 5.5 లక్షల దాకా నష్టం**
**పరిశీలించిన టీడీపీ నాయకులు**

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు30 (సందేశం టైమ్స్):: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక ఉన్న గోడౌన్ల వద్ద వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు గోనె సంచులకు నిప్పు పెట్టారు. దీంతో ఆ ఖాళీ సంచులు కాలి బూడిద య్యాయి. వ్యవసాయ మార్కెట్ అధికారులు తెలిపిన వివరాలివీ.. మార్కెట్ వెనుక వైపున 8 గోడౌన్‌లు ఉన్నాయి. ఇందులో కొంత మంది వ్యాపారులు ఖాళీ సంచులు వేసుకొని తమ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే 500 ఖాళీ సంచుల గట్టాలు (25 వేలకుపైగా ఖాళీ సంచులు) తెచ్చుకొని పెట్టుకున్నారు.బుధవారం తెల్లవారుఝామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించగా మంటలు ఎగసి పడుతుండటంతో అక్కడ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్ వారు, వ్యవసాయ మార్కెట్ అధికారులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. అప్పటికీ మంటలు అదుపు కాకపోవడంతో, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైర్ స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి అదుపు చేశారు. అప్పటికే భారీగా నష్టం జరిగింది. ఫైర్ స్టేషన్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని, వీరేష్‌కు రూ.50 వేలు, మహబూబ్ బాషాకు రూ.5 లక్షలు వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. సమాచారం అందుకున్న మార్కెట్ యార్డు సెక్రటరీ చంద్రమౌళి, మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, ఎస్ఐ మధుసూదన్ రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

# పదో తరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన




గాండ్లపెంట,అక్టోబరు30 (సందేశం టైమ్స్): వచ్చే ఏడాది 2025-26 సంవత్సరంలో నిర్వహించనున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ లాజర్ పరిశీలించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో వచ్చే ఏడాది నిర్వహించే పదో తగరతి పరీక్షా కేంద్రంలో వసతులు, గదులు, బల్లలు, ఫ్యానలు, మంచి నీటి సౌకర్యంపై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో ఆరా తీశారు. అలాగే పరీక్ష రాసే విద్యార్థులుకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ జానరెడ్డెప్ప, ఎంఈఓ కృష్ణానాయక్, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పాల్గొన్నారు.

# ఏఎంసీలకు పూర్వ వైభవం వచ్చేనా?

**పాలకొండలో మార్కెట్ యార్డు**
**రైతుల్లో చిగురిస్తున్న ఆశలు**
**గోడౌన్లు, కోల్ట్‌స్టోరేజ్ ఏర్పాటుపై దృష్టిసారించాలని విన్నపం**



పార్వతీపురం అక్టోబరు30 (సందేశం టైమ్స్):జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ)లకు మంచి రోజులు రానున్నాయా? రైతులకు విశేష సేవలు అందించనున్నాయా? అంటే అవుననే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏఎంసీల ఆధునికీకరణపై కీలక ప్రకటన చేయడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా మార్కెట్‌యార్డులను తీర్చిదిద్దాలని, పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో ఏఎంసీలకు పూర్వవైభవం రానుందని జిల్లా వాసులు భావిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌యార్డులో సివిల్ సప్లైస్ శాఖ గోడౌన్, జీడి ప్రాసెసింగ్ యూనిట్ తదితర వాటిని నిర్వహిస్తున్నారు. ఇక ప్రతి గురువారం ఈ ప్రాంగణంలో సంత జరుగుతుంది. అయితే మార్కెట్‌యార్డులో పంటలను నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్లతో పాటు కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని కొన్నాళ్లుగా ఈ ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయినా ఆ దిశగా ఎటువంటి చర్యల్లేవు. మార్కెట్ యార్డుల కమిటీ చైర్మన్లు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. రైతులకు ఉపయోగపడే అభివృద్ధి పనులు చేపట్టక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కురుపాం మార్కెట్ యార్డు నియోజక వర్గస్థాయి మట్టి నమూనా పరీక్షలకే పరిమితమైంది. ఇక్కడ గోడౌన్లు లేవు. ఈ ప్రాంతంలో చింతపండు నిల్వకు కోల్ట్‌స్టోరేజ్ అవసరం ఎంతో ఉన్నప్పటికీ అటువైపుగా అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అదనపు భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. ఇక సాలూరు ఏఎంసీలో గోడౌన్ మొక్కజొన్న రైతులకే ఉపయో గపడుతోంది. మిగతా రైతులకు ఉపయోగపడే పనులేవీ ఇక్కడ చేపట్టడం లేదు. ఇక పాలకొండలో ఉన్న మార్కెట్ యార్డు పరిస్థితి దారుణంగా ఉంది.

# పోలీసు జీపులో ఆస్పత్రికి.. కవలలు జననం

బాపట్ల, అక్టోబరు30 (సందేశం టైమ్స్): తుఫానులో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో అంబులెన్సు రాక ఇబ్బంది పడుతున్న నిండు గర్భిణిని పోలీసు జీపులో సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో కవలలకు జన్మనిచ్చింది. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం కొణికి గ్రామంలో బుధవారం జరిగిందీ ఘటన. కొణికి పంచాయతీలోని కట్టావారిపాలేనికి చెందిన ఓ మహిళకు ఉదయం పురిటినొప్పులు మొదలయ్యాయి. అప్పటికే గ్రామ సమీపంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో అంబులెన్స్ రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఇంకొల్లు ఎస్ఐ తన జీపులోనే అంగన్వాడీ కార్యకర్తల సహాయంతో గర్భిణిని ఇంకొల్లులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు కవలలు జన్మించారు.




# వరదలో చిక్కి విలవిల



కొండపి, అక్టోబరు30 (సందేశం టైమ్స్): ప్రకాశం జిల్లా కొండపి మండలం చోడవరం సమీపంలో ముసి వాగు పరీవాహక ప్రాంతంలో 121 మంది కూలీలు వరద నీటిలో చిక్కుకున్నారు. వారిని కాపాడేందుకు ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న సహా రెవెన్యూ, పోలీసు అధికారులు ఉదయం నుంచీ తీవ్ర ప్రయత్నాలు చేసి.. రాత్రి 10 గంటల సమయానికి సురక్షితంగా తీసుకొచ్చారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 121 మంది కూలీలు పొగాకు నారుమడుల్లో పనులకు వచ్చారు. వారంతా ముసికి సమీపంలో తాత్కాలిక గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. మంగళవారం అధికారులు వారి వద్దకు వెళ్లి చోడవరం జడ్పీ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి రావాలని కోరారు. అయితే, తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పి అందరూ అక్కడే ఉండిపోయారు. మధ్యాహ్నానికి ముసిలో నీటి ఉధృతి పెరిగి.. చోడవరం వద్ద నల్లవాగు కూడా పొంగింది. దీంతో కూలీలు తాము ఆపదలో ఉన్నామని, రక్షించాలని సమాచారం ఇచ్చారు. దీంతో సింగాయకొండ నుంచి బోట్లు రప్పించి వారిని సురక్షితంగా తీసుకొచ్చారు.

# జెడ్‌పి సమావేశం వాయిదా



గుంటూరు జిల్లా ప్రతినిధి :అక్టోబరు30 (సందేశం టైమ్స్):జిల్లా పరిషత్ సమావేశానికి కోరం లేకపోవడంతో జరిగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మొత్తం 57 మంది జెడ్‌పిటిసిలు, మరో 27 మంది ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఏడుగురు జెడ్‌పిటిసిలు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాత్రమే హాజరయ్యారు. కోరం ఉండాలంటే 27 మంది సభ్యులు హాజరు కావాల్సి ఉండగా 8 మందే హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా ప్రకటించారు. సమావేశం అనంతరం వైసిపి పక్షం నాయకుడు పిల్లి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో తిరిగి సమావేశం నిర్వహించాలని కోరారు. తుపాను ప్రభావం వల్ల అధికారులు వివిధ మండలాల్లో బిజీగా ఉన్నారని, పజా ప్రతినిధులు కూడా క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండటం వల్ల సమావేశానికి రాలేకపోయారని అన్నారు.

# యువకుని అవయవదానం

అక్టోబరు30 (సందేశం టైమ్స్): కాకినాడ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువకుని తన అవయవాలను దానం చేసి నలుగురికి కొత్త జీవం ఇచ్చాడు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంకు చెందిన జి.మహేష్ ఈ నెల 26వ తేదీ అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన చికిత్స కోసం మహేష్‌ను స్థానిక మెడికవర్ హాస్పిటల్స్‌కు తరలించారు. అయితే వైద్యులు ఎంత ప్రయత్నించినా యువకుడి బ్రెయిన్ స్పందించకపో వడంతో 27వ తేదీన వైద్య బృందం యువకుడిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో యువ కుని తల్లిదండ్రులు అవయవదానంపై అవగాహనతో ముందుకొచ్చి వారి కుమారుడి అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. జీవన్‌దాన్ అనుమతితో మెడికవర్ హాస్పిటల్స్‌లో అవయవ సేకరణ కార్య క్రమం నిర్వహించారు. జిజిహెచ్ ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ పి.ఫణికిరణ్ పర్యవేక్షణలో డాక్టర్ సిహెచ్. కల్యాణ్‌బాబు, డాక్టర్ రాజా అమరేంద్ర, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ అరవింద్, క్రిటికల్ కేర్ హెచ్‌ఒడి, మెడికవర్ ట్రాన్స్‌ప్లాంట్ టీమ్ సమన్వయంతో అవయవాలు



సేకరించారు. సేకరించిన అవయ వాలను గ్రీన్ ఛానల్ ద్వారా అవసరమైన ఆసుపత్రులకు తరలించి నలుగురికి కొత్త జీవితం అందించారు. జీవన్‌దాన్ ప్రతినిధి డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం అనేది జీవితానికి పరమార్థం అని అన్నారు. ఒకరి జీవిత ప్రయాణం ముగిసినా ఆయన అవయవాలు మరెందరికో కొత్త శ్వాసగా మారతాయ న్నారు. ఇది కేవలం దాతృత్వం కాదని సమాజానికి అందించే అత్యంత విలువైన బహుమతి అని, మరొకరికి కొత్త జీవితం అని అన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శు భాకరరావు మాట్లాడు తూ బ్రెయిన్ డెడ్ రోగి తిరిగి జీవించడం సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా అవయవదానం చేయుటకు ముందు వచ్చిన ఆ కుటుంబాన్ని అభినందించారు.

# కేజీబీవీ విద్యార్థినుల డిశ్చార్జి



నెల్లిమర్ల,అక్టోబరు30 (సందేశం టైమ్స్): నెల్లిమర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి గుర్లలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు డిశ్చారయ్యారు. మంగళ వారం రాత్రి గుర్ల కేజీబీవీలో షార్ట్ సర్క్యూట్ కావడంతో పరుపులు తగలబడి పొగ వ్యాపించి ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆ విద్యార్థి నులను గురైన నెల్లిమర్ల సీహెచ్‌సీకి తరలించారు. ఈమేరకు వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుకావడంతో వైద్యులు బుధవారం మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కాగా విద్యార్థినులను ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు నెల్లిమర్ల పీహెచ్‌సీలో బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ఆర్‌జేడీ విజయభాస్కర్, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా రాష్ట్ర విద్యామౌలిక వసతుల కార్పోరేషన్ డైరెక్టర్ చీకటి సుహాసిని ఆసుపత్రిని సంద ర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

# పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ ఆగ్రహం



అక్టోబరు30 (సందేశం టైమ్స్): పిఠాపురం పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు సోమరౌతు లలితదేవి, అల్లవరపు నగేష్ మాట్లాడుతూ శానిటేషన్ శు భ్రపరిచేందుకు పుష్కాట్లు, ట్రాక్టర్లు పనిచేయడం లేదని, దీంతో పట్టణం అంతా మురికికూపంగా మారిందన్నారు. కౌన్సిలర్ బోనాసుల శివ మాట్లాడుతూ డ్రైవర్స్ కాలనీ సమీపంలో ఆక్రమణలు అధికంగా ఉ ండడంతో వర్షపు నీరు రోడ్డుపై ప్రహించి ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. అక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్ బోను దేవా మాట్లాడుతూ కాంట్రాక్టర్ దివాణంను కౌన్సిల్ ఆమోదంతో బ్లాక్ లిస్టులో పెడితే అతనకు మరల పనులు ఎలా అప్పగిస్తున్నారని ప్రశ్నించారు. కౌన్సిల్ ఆమోదించిన అభివద్ధి పనులకు టెండర్లు పిలిచి త్వరితగతన పనులు పూర్తి చేయాలని కోరారు. ఉ ప్పాడ బస్ స్టాండ్ సెంటర్‌లో ఉన్న చిన్నమాంబ పార్కు చుట్టూ ఆక్రమణలు అధికమయ్యాయని, ప్రయివేటు వ్యక్తుల వాటిని ఆక్రమించుకుని రోజు వారి వ్యాపారాలు సాగించే వర్తకుల నుంచి రోజుకు సుమారు రూ.500 వసూలు చేస్తున్నట్లు కౌన్సిలర్ నగేష్ ప్రస్తావించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డును బాగు చేసుకున్న రైతులు



బెళుగుప్ప, అక్టోబరు30 (సందేశం టైమ్స్): మండలంలోని గంగవరం పంచాయతీ కృష్ణానగర్‌కు ఉన్న మట్టి రోడ్డు ఇటీవల వర్షాలకు బాగా దెబ్బతింది. దీంతో ఆ గ్రామస్థులు ఇబ్బందులు పడేవారు. రైతులు స్వంత ఖర్చులతో ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలించి.. ఆ రోడ్డును బాగుచేసుకున్నారు.

# ఆందోళన వద్దు రైతులందరికీ న్యాయం చేస్తాం : మంత్రి

సాలూరు అక్టోబరు30 (సందేశం టైమ్స్): పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందొద్దని, అందరికీ న్యాయం చేస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీనిచ్చారు. సాలూరు పట్టణ, మండల అధికారులతో మంత్రి అత్యవసర సమీక్ష నిర్వహించారు. తుపాను పరిస్థితులను ఎదుర్కోవడంలో ప్రజల భద్రత, ఆహారం, వైద్య సేవలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నదీ తీర ప్రాంతాలలో నివసించే ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. నిరాశ్రయులైన పేదలకు ఎప్పుడు బియ్యం అవసరమైనా వెంటనే అందించాలని చెప్పారు. అవసరమైతే తానే సొంత నిధులను ఇస్తానని, పేదల ఆకలి తీర్చడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వైటిసి భవనంలో ఆశ్రయం పొందుతున్న గర్భిణులకు సరైన సమయంలో వైద్యం, పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలన్నారు. తుపాను కష్టం తీరే వరకు అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ నీలకంఠరావు, ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, రూరల్ సిఐ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.పిహెచ్‌సి సందర్శన వరదనీటిలో చిక్కుకున్న మామిడిపల్లి పిహెచ్‌సిని మంత్రి సంధ్యారాణి



పరిశీలించారు. వైద్యులు, అధికారులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. సువర్ణముఖి నీటి ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు.శ్రీ మొంథా తుఫాను నేపథ్యంలో పైన పడుతున్న వర్షాలకు సాలూరు ప్రాంతంలో వేగావతి, సువర్ణముఖి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రజల రాకపోకలకు కొంతవరకు అంతరాయం కలిగింది

# పాడేరు ఘాట్లో విరిగిపడిన కొండచరియలు, బండ రాళ్లు

పాడేరు:- అక్టోబరు30 (సందేశం టైమ్స్): :అల్లూరి జిల్లా పాడేరు ఘాట్ రోడ్లో గురువారం వేకువ జామున కొండచరియలు బండరాళ్లు పడ్డాయి. మోదపల్లి జంక్షన్ కు సమీపంలో వంజంగి కాంతమ్మ వ్యూ పాయింట్ దగ్గర పెద్ద పెద్ద బండ రాళ్లు విరిగిపడ్డాయి. దీంతో ఆ ప్రదేశంలో తారు రోడ్డు తునా తునకలైంది. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ట్రాఫిక్ దిగ్బంధం ఏర్పడింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు బండరాళ్లను తొలగించి పూర్తిగా ధ్వంసమైన రోడ్డు మరమ్మతులు అత్యవసరంగా చేపట్టి ట్రాఫిక్ ను పునరుద్ధరించవలసిన పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ కారణంగా కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అధికారులు బుధవారం కూడా పాడేరు ఘాట్ లో ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేశారు. ఇటు పాడేరు ఘాట్ రోడ్లో అరకు ఘాట్ రోడ్లో బండ రాళ్లు విరిగిపడిన పరిస్థితుల వల్ల రెండు రోజుల నుంచి ట్రాఫిక్ స్తంభించింది. మన్యంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల మూడు రోజులు ఏకధాటిగా వర్షాలు కురిసిన పరిస్థితి వల్ల ఘాట్ రోడ్ లో కొండ చరియలు బండ రాళ్లు విరిగిపడే పరిస్థితి ప్రమాదకరంగా మారింది.సాయంత్రం కొంతసేపు వాతావరణం తెరిపిచ్చిన మళ్లీ రాత్రి నుంచి యధావిధిగా వర్షం పడుతుంది. ఈ పరిస్థితి కారణంగా ఘాట్ రోడ్లో ప్రయాణం ప్రమాద భరితంగా మారింది.



# చిన్న వెంకన్న ఆలయంలో విష సర్పాల కలకలం




ఏలూరు జిల్లా,అక్టోబరు30 (సందేశం టైమ్స్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకా తిరుమల చిన్న వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు తరలివస్తుంటారు. ఇక్కడ వెంకటేశ్వరస్వామి కొలువై ఉన్నారు. చిన్న వెంకన్నను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తారు. అయితే ఈ మధ్య కాలంలో ద్వారకా తిరుమల ఆలయంలో విష సర్పాలు తరుచుగా కనిపిస్తుండటం కలకలం రేపుతోంది. ఎప్పుడు ఎక్కడి నుంచి పాము వచ్చి కాటేస్తుందో అనే ఆందోళన భక్తుల్లో నెలకొంది. తాజాగా ద్వారకాతిరుమల చిన్న వెంకన్న గోశాలలో రెండు ఆవులు పాము కాటుకు గురై మృతి చెందాయి. గోశాల నుంచి గోపూజ కోసం సప్త గోకులం వద్దకు ఆవులను సిబ్బంది తీసుకెళ్లారు. సప్త గోకులాన్ని శుభ్రం చేస్తుండగా పక్కనే ఉన్న గడ్డిని ఆవులు మేస్తున్నాయి. ఈ సమయంలో ఆవులను త్రాచుపాములు కాటు వేశాయి. దీంతో రెండు ఆవులు ఉన్నట్టుండి కిందపడిపోయాయి. రెండు ఆవులు ఒకేసారి పడిపోవడాన్ని గమనించిన సిబ్బంది వచ్చి చూడగా.. అవి పాము కాటుకు గురైనట్లు గుర్తించారు.అయితే మృతిచెందిన ఆవుల కిందే పడి త్రాచుపాములు కూడా చనిపోయాయి. మొత్తం మూడు త్రాచుపాములు చనిపోయినట్లు సిబ్బంది తెలిపారు. కాగా.. రెండు రోజుల క్రితం పాత కేశఖండన శాఖ మెట్ల వద్ద ఓ మహిళను కట్లపాము కాటివేసింది. వెంటనే ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే ద్వారకా తిరుమల ఆలయ పరిసరాలు విష సర్పాలకు ఆవాసంగా మారడంతో భక్తులు భయపడుతున్న పరిస్థితి.

# తెలంగాణలో భారీ వర్షాలు.. నీటమునిగిన పంట పొలాలు

కరీంనగర్ :అక్టోబరు30 (సందేశం టైమ్స్): మొంథా తుఫాన్ కారణంగా.. కురిసిన భారీ వర్షాలకు హుజురాబాద్, శంకరపట్నం, సైదాపూర్ మండలాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేశవపట్నం వాగు ఉప్పొంగడంతో ఐకేపీ కేంద్రం గోడ కూలి నిల్వ ఉంచిన వరి ధాన్యం కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. వాగు ఉప్పొంగడంతో.. సైదాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. హుజురాబాద్‌లో కూడా చిలుకవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో.. జూపాక రోడ్డు తెగి పోయింది. భారీ వర్షం కారణంగా రోడ్డుపై ఆరబెట్టిన వడ్లు కూడా కొట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అలాగే.. సిద్దిపేట జిల్లా చేర్యాల, కొమురవెల్లి, మద్దూర్, దూల్మిట్ట మండలల్లో వరి పంటకు అపార నష్టం వట్టిల్లింది. చేర్యాల మండలంలో.. భారీగా వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ముస్త్యాల వద్ద రాగికుంట పొంగిపొర్లడంతో చేర్యాల – హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం కారణంగా.. భారీగా ధాన్యం తడిసినట్లు రైతులు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మద్దూర్‌లో 22 సెం.మీ, దూల్మిట్ట 19 సెం.మీ, చేర్యాల 17సెం.మీ, కొమురవెల్లి 12సెం.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు.మొంథా తుఫాన్ కారణంగా.. తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి




జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. వర్షాల కారణంగా భారీగా పంట నష్టం వాటిల్లింది. కుండపోత వర్షాలకు వరంగల్ – ఖమ్మం ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ఆ రూట్‌ని పోలీసులు తాత్కాలికంగా మూసివేశారు.తుఫాన్ ప్రభావంతో వరంగల్, హనుమకొండ తడిసి ముద్దయింది. ఈ మేరకు జిల్లాల్లో ఆకస్మిక వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే చాలా జిల్లాల్లో వరి ధాన్యం, మొక్క జొన్న పంటలు, చేతి కొచ్చిన పత్తి పంట తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# విమానంలో గుండెపోటు.. ఆస్పత్రికి ప్రయాణికుడి తరలింపు



శంషాబాద్(హైదరాబాద్): అక్టోబరు30 (సందేశం టైమ్స్):జెడ్డా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ68 ఇండిగో విమానం నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా చాతీలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పారు. %వారు అతనికి సీపీఆర్ చేశారు. ఉదయం 9.27 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోరులో విమానం ల్యాండ్ అయిన వెంటనే ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఖాసీంను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రైవేటు అంబులెన్స్‌లో అంబర్‌పేటలోని స్వగ్రహానికి తరలించారు.

# మత్స్యకారుల అభివృద్ధికి కృషి

## కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

## మంత్రి వాకిటి శ్రీహరి ఎమ్మెల్యే జీఎంఆర్‌తో కలిసి కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో చేప పిల్లలు విడుదల



దేవరకద్ర, అక్టోబరు30 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర క్రీడా, మత్స్య, పాడి పరిశ్రమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మత్స్యకారలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారికి పూర్తిగా అండగా ఉంటుందన్నారు. పూర్తి రాయితీతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 82 మిల్లీ మీటర్ల సైజు ఉన్న 2.50 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. దీంతో మత్స్యకారులు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. మక్తల్, నారాయణపేట, దేవరకద్ర నియోజకవర్గాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. ఎమ్మెల్యే, తాను దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాలను సమదృష్టితో చూస్తామన్ని తెలిపారు. అనంతరం నార్లోనికుంట గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. దేవరకద్ర మునిసిపాలిటీ వార్డులు బల్సుపల్లి, గోప్లాపూర్, మీన్గోనిపల్లిలో పార్కులకు, దేవరకద్ర మునిసిపాలిటీలో రూ.3 కోట్లతో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ నమూన ఇంటిని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాల్లో మినీ స్టేడియాలు, మూడు మునిసిపాలిటీల్లో చేపల మార్కెట్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ నరేశ్‌బాబు, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# శ్రీశైలం రాకపోకలకు అంతరాయం



శ్రీశైఅక్టోబరు30 (సందేశం టైమ్స్):భారీ వర్షాల కారణంగా శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్లే రహదారిపై లింగాలగట్టు వద్ద తెల్లవారుజామున కొండచరియలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీనితో శ్రీశైలం నుంచి తెలంగాణ వైపు బయల్దేరిన వాహనాలన్నీ చిక్కుకుపోయాయి. పోలీసులు గంటల తరబడి కష్టపడి భారీ రాళ్లు, మట్టిని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మరోవైపు భారీ వర్షాల కారణంగా శ్రీశైలం నుంచి తెలంగాణ, ఏపీ వైపు వెళ్లేందుకు రోడ్ క్లియరెన్స్ లేకపోవడంతో అటవీ అధికారులు బుధవారం ఉదయం నుంచి రాకపోకలను నిలిపివేశారు. అప్పటికే వసతి గదులు ఖాళీ చేసి తిరుగుముఖం పట్టిన యాత్రికుల వాహనాలు టోల్‌గేట్ వద్ద బారులు దీరాయి. బస్సులు నడవకపోవడంతో వందలాది మంది యాత్రికులు బస్టాండ్‌లోనే ఉండిపోయారు. దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో అల్పాహారం, మంచినీరు, పాలు, బిస్కెట్లను బస్టాండ్, ఔటర్ రింగ్‌రోడ్డు, శిఖరం ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్దకు తరలించి యాత్రికులకు అందించారు. కొన్ని గంటల తర్వాత అధికారులు వాహనాలను అనుమతించారు. ఇక ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద కొండలపై నుంచి రాళ్లు జారిపడ్డాయి. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఇళ్లు, మూడు షాపులు ?ధ్వంసమయ్యాయి. పోలీసులు పరిశీలించి రాళ్లను తొలగించేలా చర్యలు తీసుకున్నారు సున్నిపెంట పూర్ణానంద ఆశ్రమం ప్రాంతంలోనూ పలు కాలనీలను వాన నీరు ముంచెత్తింది. ఆరో వార్డులోని ఒక రేషన్ షాపులో సుమారు 72 క్వింటాళ్ల బియ్యం తడిసిపోయింది.

# రోజంతా ఎడతెరిపి లేని వర్షం

భువనగిరి టౌనఅక్టోబరు30 (సందేశం టైమ్స్): తుఫాను కారణంగా భువనగిరిలో రోజంతా వర్షం కురిసింది. 54.3 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదయింది. అర్బనకాలనీలో రెండు విద్యుత స్తంబాలు విరిగాయి. మరికొన్ని ప్రాంతాలలో చెట్ల కొమ్మలు విరిగిపడగా తెగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలలో వరదనీరు చేరింది. మురికి కాలువలు, రహదారులు వర్షం నీటితో పొంగి ప్రవహించాయి. పాఠశాలలకు ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులకు గురయ్యారు. సెలవు ప్రకటన రాకముందే పలువురు విద్యార్థులు పాఠశాలలకు వెళ్లిపోయారు. అనంతరం సెలవు ప్రకటించడంతో వెనుతిరిగినప్పటికీ వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంట పొలాల్లో వర్షం నీరు నిలవడంతో రైతులలో ఆందోళన నెలకొన్నది. ఇతర ప్రాంతాల వాసులు రాకపోవడం, పట్టణవాసులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లకపోవడంతో రహదారులపై జనసంచారం తగ్గడంతోపాటు అన్ని మార్కెట్‌లలో కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. శి?థిల భవనాలకు విద్యుత స్తంభాలకు, ట్రాన్సఫార్మర్లకు, చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు.



వర్షం నీటితో స్తంభించే మురికి కాలువలను, మ్యానహెూల్స్‌ను శుభ్రం చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం తెలిపారు.

# అన్నదాతకు దెబ్బ మీద దెబ్బ!

హైదరాబాదఅక్టోబరు30 (సందేశం టైమ్స్): ప్పటి నుంచి అన్నదాతలపై దెబ్బ మీద దెబ్బ పడుతోంది. తొలుత అనావృష్టి, తర్వాత అతివృష్టి, ఇప్పుడు అకాల వర్షాలు... రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు నీటి పాలయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ప్రభుత్వం పంటల కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటుచేయగా.. మరోవైపు అకాల వర్షాలతో ధాన్యం, పత్తి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులు తడిసిపోవటం, తేమ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావం కూడా రాష్ట్రంపై ఎక్కువగా ఉండటం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రంలో ఏడాది సగటు వర్షపాతం 923.8 మి.మీ. అయితే... నైరుతి రుతుపవనాలతో(జూన్–సెప్టెంబరు వరకు) 740.6 మి.మీ, ఈశాన్య రుతుపవనాలతో 110.2 మి.మీ వర్షపాతం కురిస్తే లెక్క సరిపోతుంది. కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో 1,109 మి.మీ వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం మొత్తం



కలిపి 1,023 మి.మీ వర్షపాతం నమోదైతే.. ఈసారి ఐదు నెలల్లోనే 1,109 మి.మీ వర్షపాతం నమోదు కావటం గమనార్హం. సాధారణ వర్షపాతంతో పోలిస్తే 34 శాతం అధికంగా నమోదైంది. అయితే వానాకాలం సీజన్ ప్రారంభ దశలో జూన్‌లో 20% లోటు వర్షపాతం నమోదైంది. రైతులు విత్తనాలు వేయటానికి కూడా వెనకా ముందూ ఆలోచించారు. జూలైలోనూ అంతంతమాత్రంగానే వర్షాలు పడ్డాయి. ఈ రెండు నెలలు కూడా రైతులు వర్షాభావ పరిస్థితులతో ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు వచ్చేసరికి నైరుతి రుతుపవనాలు విజృంభించాయి. ఆ నెలలో 378.5 మి.మీ (75% అధికం), సెప్టెంబరులో 267.7 మి.మీ (60% అధికం) వర్షపాతం నమోదైంది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



గణేశ్‌నగర్, అక్టోబరు30 (సందేశం టైమ్స్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు. ఇప్పటికే ప్రైవేట్ డిగ్రీ, వృత్తి విద్య కళాశాలల యాజమాన్యాలు రెండుసార్లు సమ్మెకు వెళ్లాయన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే విద్యార్థులకు విద్యను దూరం చేయడమేనా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకపోతే రాష్ట్రంలో మంత్రులు ఎమ్మెల్యేలు తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి యోగేష్, బామండ్ల నందు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విగ్నేష్, వంశీ, విష్ణు, ప్రదీప్, అజయ్, సాయి, నిఖిల్, విగ్నేష్, ప్రశాంత్, ఆకాష్, మురళి, రాజేష్, సాయి కృష్ణ పాల్గొన్నారు.



# క్రీడావార్తలు



## విషాదం.. ఆసీస్ యువ క్రికెటర్ మృతి

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పదకొండేళ్ల క్రితం ఫిల్ హ్యూస్ మైదానంలోనే కుప్పకూలిన ఉదంతం ఇప్పటికీ అభిమానులను కలవరపెడుతూనే ఉంది. అయితే ఇదే తరహాలో 17 ఏళ్ల యువ క్రికెటర్ ప్రాణాలు కోల్పోయాడు. రెండు రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది.మెల్‌బోర్న్‌కు చెందిన బెన్ అస్టిన్ టీ20 మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ట్రైనింగ్ సెషన్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా బంతి అతడి మెడకు బలంగా తగిలింది. దీంతో ఒక్కసారిగా మైదానంలో అతడు కుప్పకూలిపోయాడు. సహచర క్రికెటర్లు స్పందించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు రోజులపాటు మృత్యువుతో పోరాడిన అస్టిన్ గురువారం ఉదయం ప్రాణాలు విడిచినట్లు వైద్యులు తెలిపారు. ప్రాక్టీస్ సమయంలోనూ అతడు తలకు హెల్మెట్ పెట్టుకుని ఉన్నట్లు అక్కడి క్రికెట్ వర్గాలు తెలిపాయి.బెన్ మరణంపై ఫెర్న్‌ట్రీ గల్లీ క్రికెట్ క్లబ్ ఓ ప్రకటన విడుదల చేసింది. 'బెన్ క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ మ్యాచ్‌లు కూడా ఆడేవాడు. అతడి




ఆకస్మిక మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. అతడి మృతి మా క్రికెట్ కమ్యూనిటీపై ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా అందరికీ ఓ విజ్ఞప్తి చేస్తున్నాం. ఇలాంటి సమయంలో బెన్ కుటుంబం గోప్యతకు భంగం కలిగించవద్దు' అని పేర్కొంది.

## 2 సిక్సర్లతో భారీ లికార్డు: రోహిత్ సరసన సూర్య!




క్రీడా వార్తలు: ఇటీవలే భారత్, ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్ ముగిసింది. 2-1 తేడాతో ఆసీస్ సిరీస్ ను కైవసం చేసుకుంది. బుధవారం నుంచి టీ 20 సిరీస్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. కాన్ బెర్రా వేదికగా తొలి మ్యాచ్ జరిగింది. అయితే వర్షం కారణంగా పూర్తి మ్యాచ్ జరగలేదు. మరోవైపు ఆస్ట్రేలియాతో జరిగిన ఈ తొలి టీ20 మ్యాచ్ లో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ ఓ అద్భుతమైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడుసూర్యకుమార్ ఇంటర్నేషనల్ టీ20 క్రికెట్‌లో 150 సిక్సర్ల మైలురాయిని అధిగమించాడు. ఈ ఘనత సాధించిన ఇండియా ప్లేయర్లలో రోహిత్ శర్మ(ర్వాత స్థానం సూర్యదే కావడం విశేషం. కాన్ బెర్రా మ్యాచ్‌లో సూర్య కుమార్ యాదవ్ తన రెండో సిక్స్‌ను కొట్టగానే 150 సిక్సర్ల ప్రత్యేక క్లబ్‌లో చేరాడు. 86 ఇన్నింగ్స్ లో 1,649 బంతులు ఎదుర్కొన్న సూర్య ఈ మైలురాయిని అందుకున్నాడు. అంతేకాకుండా అంతర్జాతీయంగా ఈ అరుదైన మైలురాయిని చేరుకున్న ఐదో బ్యాటర్‌గా సూర్య నిలిచాడు.అత్యంత వేగవంతమైన బ్యాటర్లలో సూర్య(ఒకడు. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20లలో భారత్ తరపున అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు ఇప్పటికీ రోహిత్ శర్మ పేరు మీదే ఉంది. రోహిత్ శర్మ 205 సిక్సర్లు కొట్టాడు. తాజాగా ఈ క్లబ్( లో రోహిత్ సరసన సూర్య చేరాడు. ఈ మ్యాచ్ లో సూర్య ఇంకో రికార్డు సాధించాడు నాలుగు వేర్వేరు దేశాల్లో (దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, భారతదేశం) టీ20 సెంచరీలు సాధించిన ఏకైక ఆటగాడు కూడా సూర్యకుమార్ యాదవే కావడం గమనార్హం.

## శ్రేయస్ అయ్యర్ హెల్త్‌పై బీసీసీఐ అప్‌డేట్

క్రీడా వార్తలు: ఆస్ట్రేలియా టూర్ లో టీమిండియా స్టార్ ప్లేయర్ శ్రేయస్ అయ్యర్‌కు పెద్ద గాయమైన సంగతి తెలిసిందే. సిడ్నీ గ్రౌండ్ లో జరిగిన మూడో వన్డే సందర్భంగా ఆసీస్ ప్లేయర్ అలెక్స్ కారీ క్యాచ్ ను పట్టుకునే క్రమంలో అయ్యర్ కింద పడిపోయాడు. ఈ క్రమంలో అతడి పక్కటెములకు గాయమైంది. అతడిని వెంటనే సిడ్నీ ఆస్పత్రికి తరలించగా.. అంతర్గతంగా రక్త స్రావమైనట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం అతడు సిడ్నీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తాజాగా శ్రేయస్ అయ్యర్ హెల్త్ గురించి బీసీసీఐ మరో కీలక అప్ డేట్ ఇచ్చింది.'శ్రేయస్ ఆరోగ్య పరిస్థితిని మేము పర్యవేక్షిస్తున్నాము. అతడి విషయంలో వైద్యుల సలహాను పాటిస్తాము. ప్రస్తుతానికి అతడికి పెద్ద ప్రమాదం ఏమిలేదు. అతను జనవరిలో దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్ కు ఆడటానికి ఫిట్‌గా ఉంటాడని ఆశిస్తున్నాము. అతను ఇంటికి వెళ్లడానికి ఫిట్ అయ్యే వరకు అతను సిడ్నీలోనే ఉంటాడు' అని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. అతను ప్రస్తుతం ఐసీయు నుంచి బయటకు వచ్చి.. నార్మల్ వార్డులో ఉన్నాడని, జనవరి 2026 వరకు అతను తిరిగి ఆటలోకి రాలేడని బీసీసీఐ తెలిపింది.శ్రేయస్ అయ్యర్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఇండియాకు రానున్నాడు. అయితే స్వదేశానికి వచ్చాక..




అతడు గ్రౌండ్ లోకి రావడానికి నాలుగు నుంచి ఆరు వారాలు పట్టవచ్చని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. నవంబర్ 30 నుంచి భారత్ లో సౌతాఫ్రికా సిరీస్ జరగనుంది. దీనికి అయ్యర్ దూరమయ్యే అవకాశాలు ఎక్కువ కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

## 8 ఏళ్ల హిస్టరీ.. భారత్ రిపీట్ చేసేనా?



క్రీడా వార్తలు: మహిళల ప్రపంచ కప్ 2025 చివరి దశకు చేరుకుంది. మరో మూడు రోజుల్లో టోర్నీ ముగియనుంది. సెకండ్ సెమీ-ఫైనల్ నేడు(అక్టోబర్ 30) భారత్, ఆస్ట్రేలియామధ్య ముంబైలో జరగనుంది. డాక్టర్ డివై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో ఈ మ్యాచ్ జరగుతుంది. ఈ మ్యాచ్ టీమిండియాకు చాలా కీలకం. ఫైనల్‌కు చేరుకోవడానికి భారత్.. ఈ మ్యాచ్ లో చాలా కష్టపడాల్సి ఉంది. ఈ టోర్నీలో ఆస్ట్రేలియా జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోక పోవడమే హర్మన్ ప్రీత్ కౌర్ జట్టుకు అతిపెద్ద సవాలు. కాబట్టి, ఫైనల్‌కు చేరుకోవడానికి భారత్(%ూవషశీఅ ూవఎఱ-ఖీఱఅఞశ్రీ%) అంచనాలకు మించి రాణించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో 8 ఏళ్ల క్రితం జరిగిన హిస్టరీని భారత్ మరోసారి రిపీట్ చేస్తుందా అనే ప్రశ్న క్రికెట్ అభిమానుల్లో నెలకున్నాయి. మరి.. హిస్టరీ ఏంటో ఇప్పుడు చూద్దాం..

క్రికెట్ ఆటలో ఆస్ట్రేలియా ఆధిపత్యం ఎక్కువ గా కనిపిస్తుంది. ఇక ఐసీసీ టోర్నీల్లో అయితే ఆ జట్టు చెలరేగిపోతుంది. పురుషుల జట్టైనా, మహిళల జట్టైనా ఆస్ట్రేలియాకు వరల్డ్ కప్ అంటే పూనకం వస్తుంది. వాళ్లను ఆపడం అంత ఈజీగా కాదు. మహిళా ప్రపంచ కప్ ను అత్యధిక సార్లు గెలిచిన జట్టుగా ఆసీస్ కు రికార్డు ఉంది. ఈసారి కూడా బలమైన పోటీదారుగా గ్రౌండ్ లోకి అడుగుపెడుతున్నారు. గత ఎనిమిదేళ్లలో ఆస్ట్రేలియా ఒక్క ప్రపంచ కప్ మ్యాచ్‌ను కూడా కోల్పోలేదు. అయితే, మహిళల ప్రపంచ కప్‌లో ఎవరైనా ఆస్ట్రేలియాను ఓడించగలిగితే అది భారత్( మాత్రమే. ఎనిమిదేళ్ల (2017 క్రితం ఆసీస్ కు భారత్ ఊహించని షాకిచ్చింది.

8 ఏళ్ల క్రితం ఏం జరిగిందంటే..

2017 మహిళల ప్రపంచ కప్(లో ఆస్ట్రేలియాకు భారత్ రూపంలో పెద్ద దెబ్బ తగిలింది. ఆ ఎడిషన్ సెమీఫైనల్లో రెండు జట్లు తలపడ్డాయి. టీమిండియా ఆస్ట్రేలియాను ఓడించడంతో ఆ జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. ఆ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది.

## భారత్, ఆసీస్ సెమీ ఫైనల్ రద్దైతే.. ఫైనల్ చేరే జట్టు ఇదే?



క్రీడా వార్తలు: మహిళా ప్రపంచ కపలో భాగంగా నేడు(అక్టోబర్ 30) భారత్, ఆస్ట్రేలియా మధ్య రెండవ సెమీ-ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఎలాగైనా ఆసీస్ ను ఓడించి.. ఫైనల్ కు చేరాలని టీమిండియా కసిగా ఉంది. అది అంత ఈజీ కానప్పటికీ...కాస్తా శ్రమిస్తే సుసాధ్యం అవుతుందని క్రీడా నిపుణుల చెబుతున్నారు. ఇది ఇలా ఉంటే... ఈ మ్యాచ్ కి వాన గండం ఉంది. ఇప్పటికే ఈ ప్రపంచ కప్‌లో అనేక మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ఇప్పుడు సెమీ-ఫైనల్ మ్యాచ్‌ను కూడా వర్షపు మేఘాలు కప్పేశాయి. టీమిండియా చివరి లీగ్ మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దైన సంగతి తెలిసిందే. ఈ సెమీ ఫైనల్ మ్యాచ్ ఆగితే ఏం జరుగుతుంది. ఏ జట్టు ఫైనల్ కు వెళ్తుందనే ఆసక్తి క్రికెట్ అభిమానుల్లో నెలకొంది. ఈ వరల్డ్ కప్ లో సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచులకు రిజర్వ్ డే ఉంది. మ్యాచ్ షెడ్యూల్ చేసిన రోజున జరగకపోతే, మ్యాచ్ రిజర్వ్ డేలో జరుగుతుంది. మ్యాచ్ రిజర్వ్ డేలో కూడా జరగకపోతే.. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా ఫైనల్‌కు ప్రవేశిస్తుంది. లీగ్ దశలో శ్రీలంక మ్యాచ్ తప్పా.. మిగిలిన అన్ని జట్లపై ఆస్ట్రేలియా విజయం సాధించింది. శ్రీలంకతో జరగాల్సి మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దైంది.భారత్, ఆస్ట్రేలియా మధ్య రెండవ సెమీ ఫైనల్ మ్యాచ గురువారం ముంబైలోని %ణ్% పాటిల్ స్టేడియాంలో జరుగుతుంది. మ్యాచ్ రోజున ముంబైలో భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే, రాబోయే 48 నుంచి 72 గంటల్లో, బలమైన గాలులతో ముంబైలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇది భారత్, ఆసీస్ మధ్య జరిగే రెండవ సెమీఫైనల్‌ను ప్రభావితం చేయవచ్చు. మ్యాచ్ రోజున, మధ్యాహ్నం నాటికి 69 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మొత్తం 3.8 మి.మీ. గురువారం వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ నివేదించింది. రిజర్వ్ డే అక్టోబర్ 31న కూడా ముంబైలో వర్షం పడే అవకాశం ఉంది.

## సూర్య ప్రతాపంపై నీళ్లు

కాన్‌బెర్రా: చాన్నాళ్ల తర్వాత ఫామ్ దొరకబుచ్చుకున్న టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39 నాటౌట్) జోష్‌పై వరుణుడు నీళ్లు కుమ్మరించాడు. ఎడతెగని వర్షం కారణంగా ఆస్ట్రేలియా-భారత్ జట్ల మధ్య తొలి టీ20 అర్ధంతరంగా రద్దయింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఆట నిలిచే సమయానికి 9.4 ఓవర్లలో 97/1 స్కోరు చేసింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (20 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 37 నాటౌట్), సూర్య రెండో వికెట్‌కు 35 బంతుల్లో 62 పరుగులు జోడించారు. అంతకుముందు 5 ఓవర్లు పూర్తవగానే సుమారు 40 నిమిషాలపాటు వాన ఆటంకం కలిగించడంతో మ్యాచ్‌ను 18 ఓవర్లకు కుదించారు. కానీ ఆ తర్వాత




మరోసారి మొదలైన వర్షం ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. రెండో టీ20 శుక్రవారం మెల్‌బోర్న్‌లో జరగనుంది.అభిషేక్ విఫలం: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు అభిషేక్ శర్మ (14 బంతుల్లో 4 ఫోర్లతో 19) అదిరే ఆరంభాన్ని అందించలేక పోయాడు. 4వ ఓవర్‌లో ఎల్లిస్ బౌలింగ్‌లో గిల్ 2 ఫోర్లతో జోరు చూపినా.. పేలవ షాట్ ఆడిన అభిషేక్ మిడాన్‌లో డేవిడ్‌కు క్యాచిచ్చాడు. దీంతో తొలి వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.

## అమ్మాయిలకు అగ్నిపరీక్ష



నవీ ముంబై: కొంచెం కష్టానికి మరికొంత అదృష్టం కలిసొచ్చి వరల్డ్ కప్‌లో సెమీఫైనల్‌కు చేరిన భారత జట్టు ఇప్పుడిక అసలు సిసలు సవాలుకు సిద్ధమైంది. గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో పటిష్టమైన ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ సందర్భంగా డెర్బీలో జరిగిన 2017 ప్రపంచ కప్ సెమీఫైనల్లో ఆస్ట్రేలియా జట్టుపైనే ప్రస్తుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చేసిన అసామాన ప్రదర్శన గుర్తు చేసుకోవాలి. ఆ మ్యాచ్‌లో ప్రత్యరి బౌలర్లపై విరుచుకు పడిన కౌర్ కేవలం 115 బంతులలో అజేయంగా 171 పరుగులు చేసి భారత్‌కు అపురూప విజయం అందించింది. మరి..ఈసారి సెమీఫైనల్లోనూ కౌర్ సారథ్యంలోని మన అమ్మాయిలు ఆ మ్యాచ్ ఫలితాన్ని పునరావృతం చేస్తారేమో చూడాలి. కానీ ఈసారి టోర్నీలో హర్మన్ సేన నిలకడైన ప్రదర్శన కనబర్చలేకపోయింది. వరుసగా మూడు పరాజయాలు చవిచూడడవే అందుకు ఉదాహరణ.

# బిజినెస్



## వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్ ప్రకటించిన యూట్యూబ్

ఇంటర్నెట్ డెస్క్: ఏఐ యుగం రావడంతో ప్రపంచవ్యాప్తంగా లేఆఫ్స్‌ల సునామీ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ సంస్థ యూట్యూబ్ సరికొత్త దిశగా అడుగులు వేస్తోంది. ఉద్యోగులను తొలగించకుండా స్వచ్ఛందంగా తామంతట తామే బయటకు వెళ్లేందుకు వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్‌ను ప్రకటించింది. దీంట్లో భాగంగా సీఈవో నీల్ మోహన్ ఓ కీలక ప్రకటన చేశారు. 'పదేళ్లలో తొలిసారిగా యూట్యూబ్ ప్రొడక్ట్ విభాగాన్ని పూర్తిగా పునర్మిస్తున్నాం. ఏఐ ఆధారంగా యూజర్ అనుభవాన్ని మెరుగుపర్చే దిశగా ముందుకు సాగుతున్నాం. అందుకోసం బలవంతపు తొలగింపులు చేయడం లేదు. తమ కెరీర్‌ను మార్చుకోవాలనే ఉద్యోగుల కోసం వాలంటరీ ఎగ్జిట్ ప్యాకేజీలు అందిస్తున్నాం. ఇవి ముఖ్యంగా అమెరికాలో పనిచేస్తున్న సిబ్బందికే వర్తిస్తాయి' అని పేర్కొన్నారు. అయితే కంటెంట్ క్రియేషన్, యూజర్ ఎక్స్‌పీరియన్స్‌లో ఏఐ పాత్రను దృష్టిలో ఉంచుకుని వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్‌ను తీసుకొచ్చింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా గూగుల్, మెటా, అమెజాన్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ సంస్థలు ఏఐ ఆధారిత మోడళ్లను అమలు చేస్తున్నాయి. యూ ట్యూబ్ కూడా అదే దారిలో అడుగుపెడుతోంది. కంటెంట్ క్రియేషన్, ఎడిటింగ్, సబ్ టైటిలింగ్, కంటెంట్ మోనిటైజేషన్‌లో ఏఐ వినియోగాన్ని విస్తృతం చేయడానికి యూట్యూబ్ చర్యలు చేపట్టింది. దీంతో ఏఐ ఆధారంగా యూజర్ ప్రిఫరెన్స్ గుర్తించడం, వీడియో సిఫార్సులు




మరింత కచ్చితంగా ఇవ్వడం వంటి మార్పులు త్వరలోనే అమలులోకి రానున్నాయి.

ఉద్యోగుల భవిత్యంపై ప్రశ్న!

వాలంటరీ ఎగ్జిట్ ప్లాన్ అంటూ సంస్థ వినూత్నంగా ఆలోచించినప్పటికీ ఉద్యోగుల కెరీర్‌పై ఇది ప్రభావం చూపుతుంది. కొంత మంది ఉద్యోగులు తమ భవిష్యత్తు పట్ల ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే మరోవైపు, ఏఐ ఆధారిత నూతన అవకాశాలు, క్రియేటివ్ రంగంలో కొత్త జాబ్ రోల్స్ లభిస్తాయనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

## పసిడి ప్రియులకు గుడ్ న్యూస్.. భారీగా తగ్గిన ధరలు..




ఇంటర్నెట్ డెస్క్: బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం తగ్గుముఖం పడుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. గత రెండు వారాల్లో పసిడి ధర భారీగా తగ్గింది. ఈ క్రమంలో బంగారం ధర ఇవాళ(గురువారం) కూడా భారీగా పడిపోయింది. దాదాపు రూ.2 వేలు తగ్గింది. అంతర్జాతీయంగా బంగారం ఔన్స్ ధర తగ్గడంతో దేశీయంగా బంగారం ధరలు పతనమవుతున్నాయి. భారత్‌లో నిన్న 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం రూ.1,22,400 ఉంది. ఇవాళ రూ.1,910 మేర తగ్గి రూ.1,20,490 చేరింది. దీంతో పసిడి ప్రియులు కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

## ఎన్‌విడియా ఏ 5 లక్షల కోట్ల డాలర్లు




న్యూయార్క్: కృత్రిమ మేధ (ఏఐ) చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియా సరికొత్త రికార్డు సృష్టించింది. అమెరికా స్టాక్ మార్కెట్లో కంపెనీ షేరు బుధవారం నాడు ఒక దశలో 5.17 శాతం పెరిగి 211.43 డాలర్లకు చేరింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.13 లక్షల కోట్ల డాలర్లకు ఎగబాకింది. ప్రపంచంలో 5 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువకు చేరుకున్న ఏకైక, తొలి కంపెనీ ఇదే. భారత్, జపాన్, యూకే జీడీపీల కంటే అధికమిది. కంపెనీకి 50,000 కోట్ల డాలర్ల విలువైన ఏఐ చిప్‌ల ఆర్డర్లు లభించాయని, అమెరికా ప్రభుత్వం కోసం 7 కొత్త సూపర్ కంప్యూటర్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎన్‌విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ ప్రకటించడం తాజా ర్యాలీకి దోహదపడింది. అలాగే, 6జీ సెల్యులార్ టెక్నాలజీ అభివృద్ధి కోసం నోకియాలో 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడుతున్నట్లు కంపెనీ ప్రకటించడం కూడా ఇందుకు తోడ్పడింది. మంగళవారం ట్రేడింగ్‌లోనూ కంపెనీ షేరు 5% మేర లాభపడింది. ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల జాబితాలో ఎన్‌విడియా తర్వాత ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్, మైక్రోసాఫ్ట్ 4 లక్షల కోట్ల డాలర్లకు పైగా మార్కెట్ విలువతో వరుసగా 2,3 స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏఐ సేవలకు, చిప్‌లకు డిమాండ్ శరవేగంగా పెరుగుతుండటంతో ఎన్‌విడియా షేరు కూడా అంతే వేగంగా పెరుగుతూ వచ్చింది. ఈ ఏడాదిలో ఇప్పటికే 50% పైగా పుంజుకుంది.

## గృహ రుణాలు తీసుకుంటున్నారా? ఇవి పాటిస్తే మీకు లక్షలు ఆదా..




ఇంటర్నెట్ డెస్క్: ప్రతి ఒక్కరికి ఎన్నో కలలకు ఉంటాయి. అలాంటి వాటిల్లో సొంత ఇల్లు ఉండాలనే కల ఒకటి. అందుకే కొందరు రేయింబవళు కష్టపడి ఈ డ్రీమ్ ను నెరవేర్చుకుంటారు. మరోవైపు ఇటీవల కాలంలో చాలా మంది సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ఎక్కువగా హోమ్ లోన్ పై ఆధారపడుతున్నారు. హోమ్ లోన్ విషయంలో స్థిర(ఫిక్స్‌డ్), ఫ్లోటింగ్ అనే రెండు రకాల వడ్డీ రేట్లు ఉంటాయి. గృహ రుణం తీసుకునే విషయంలో ఈ రెండూ వడ్డీ రేట్ల గురించి తెలుసుకుంటే లక్షలు ఆదా చేసుకోవచ్చని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం..ఇందులో మనం తీసుకున్న హోం లోన్ కు ఈఎంఐప్రతి నెలా ఒకే విధంగా ఉంటుంది. మార్కెట్ హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా మనం కట్టే ఈఎంఐ స్థిరంగా ఉంటుంది. ఇది సామాన్యుల బడ్జెట్‌ను సులభతరం చేస్తుంది. దీని వలన నెలవారీ బడ్జెట్ ప్రణాళిక ఈజీ అవుతుంది. ఫిక్స్‌డ్ వడ్డీరేటు ఫ్లోటింగ్ రేటు కంటే 1 నుంచి 1.5 శాతం వరకు ఎక్కువగా ఉంటుంది. ఒక వేళ భవిష్యత్తులో వడ్డీ రేట్లు తగ్గితే.. ఫిక్స్‌డ్ వడ్డీ రేటు వల్ల ఆ బెనిఫిట్స్ దక్కవు.ఫ్లోటింగ్ వడ్డీ రేట్ అనేది హోమ్ లోన్ పై వడ్డీ రేటు మార్కెట్ పరిస్థితుల ఆధారంగా మార్పులకు లోనవుతుంది. బ్యాంక్ బెంచ్‌మార్క్ రేటుతో ముడిపడి ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఫ్లోటింగ్ వడ్డీ రేటులో మార్కెట్ వడ్డీ రేట్లు తగ్గినప్పుడు ఈఎంఐ తగ్గుతుంది. ఒక వేళ ఆర్బీఐ వడ్డీ రేట్లు పెంచితే.. హోమ్ లోన్ ఈఎంఐ పెరుగుతుంది. ఫ్లోటింగ్ రేట్లు సాధారణంగా ఫిక్స్‌డ్ రేట్ల కంటే తక్కువగా ఉంటాయి. కారణం...దాదాపు వడ్డీ రేట్లు ఎల్లప్పుడూ ఎక్కువగా ఉండవు.ఎవరైనా అధిక ఫిక్స్‌డ్ రేటు కు రుణం తీసుకుని.. మార్కెట్ రేట్లు తగ్గి ఉంటే, బ్యాలెన్స్ బదిలీ అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ ఆప్షన్ ద్వారా ఫిక్స్ డ్ నుంచి ఫ్లోటింగ్ లోకి బదిలీ కావచ్చు. ఇలా కేవలం 0.5% లేదా 1శాతం రేటు తగ్గింపుతో లక్షల రూపాయలు ఆదా అవుతాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఈ ప్రక్రియలో పలు రకాల ఛార్జీలు ఉంటాయి. కాబట్టి నిర్ణయం తీసుకునే ముందు ఈ ఖర్చులను గమనించండి. ఎవరైనా.. హోమ్ లోన్ తీసుకునే ముందు వారి ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తు ఆదాయ అంచనాలు, మార్కెట్ స్థితిగతులను బేరీజు వేసుకొని సరైన నిర్ణయం తీసుకోవడం చాలా అవసరమని నిపుణులు సలహా ఇస్తున్నారు.

## యూనియన్ బ్యాంక్‌తో బీఓఐ విలీనం!

న్యూఢిల్లీ: ప్రభుత్వ బ్యాంకింగ్ రంగంలో మరో విడత విలీనాలకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ)ను విలీనం చేసే ఆలోచనలో ఉన్నట్లు ఈ విషయంతో సంబంధం ఉన్న అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ విలీనం జరిగితే, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) తర్వాత దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ బ్యాంక్ (పీఎసబీ)గా అవతరించనుంది. ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లన్నింటిలో నాలుగో అతిపెద్ద బ్యాంక్‌గా మారనుంది. ప్రస్తుతం పీఎసబీల్లో రెండో స్థానంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) మొత్తం ఆస్తుల విలువ ఈ జూన్ 30నాటికి రూ.18.62 లక్షల కోట్లుగా ఉంది. యూబీఐ–బీఓఐ విలీనం ద్వారా ఏర్పడే బ్యాంక్ మొత్తం ఆస్తుల విలువ రూ.25.67 లక్షల కోట్లకు చేరనుంది.దేశీయ బ్యాంకింగ్ రంగంలో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ‌సీ బ్యాంక్ తర్వాత మూడో స్థానం లో ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ప్రస్తుత ఆస్తులు రూ.26.42 లక్షల కోట్లకు విలీన బ్యాంక్ ఆస్తుల విలువ చేరువ కానుంది.చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), ఇండియన్ బ్యాంక్‌లను సైతం ఒక్కటి చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అంతేకాదు, మిగతా పీఎసబీలతో పోలిస్తే తక్కువ ఆస్తులు కలిగిన పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ (పీ అండ్ ఎస్‌బీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)ను భవిష్యత్‌లో ప్రైవేటీకరించే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.చివరిసారి 2020లో మోదీ ప్రభుత్వం పీఎస్‌బీల విలీనాలను చేపట్టింది.




దీంతో పీఎస్‌బీల సంఖ్య 27 నుంచి 12కు తగ్గింది. ఈ మార్చి నాటికి ఈ డజను పీఎసబీల ఆస్తుల మొత్తం విలువ దాదాపు 1.95 లక్షల కోట్ల డాలర్లు. అంటే, మన కరెన్సీలో సుమారు రూ.171 లక్షల కోట్లు. దేశీయ బ్యాంకింగ్ రంగ మొత్తం ఆస్తుల్లో 55 శాతానికి సమానమిది.

వికసిత్ భారత్ లక్ష్యాల్లో భాగంగానే..

ఆస్తుల విలువపరంగా ప్రస్తుతం ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫసీ బ్యాంక్ మాత్రమే ప్రపంచంలోని 100 అతిపెద్ద బ్యాంకుల జాబితాలో ఉన్నాయి. వీటి తరహాలో మరో 3–4 మెగా పీఎసబీలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈసారి విలీనాలను చేపట్టనున్నట్లు సమాచారం.

## ఐదేళ్లలో మార్కెట్లోకి 8 కొత్త ఎస్‌యూవీలు

టోక్యో: రాబోయే ఐదేళ్ల కాలంలో ఎనిమిది కొత్త ఎస్‌యూవీలను మార్కెట్లోకి తీసుకురానున్నట్లు దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎసఐ) ప్రకటించింది. ఈ కొత్త ఎస్‌యూవీలతో కంపెనీకి చెందిన ఎస్‌యూవీల సంఖ్య 28కి చేరుతుంది. భారత మార్కెట్లో 50% మార్కెట్ వాటా తిరిగి సాధించాలన్నది తమ ధ్యేయమని, ఇందుకు అది సహాయకారి అవుతుందని సుజుకీ మోటార్ కార్పొరేషన్ రిప్రెజెంటేటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ అన్నారు. అయితే తీవ్రమైన పోటీ నెలకొన్న భారత మార్కెట్లో ఆ లక్ష్యాన్ని చేరడం అంత తేలికైన పని కాదని జపాన్ మొబిలిటీ షో సందర్శించిన భారతీయ విలేకరులతో మాట్లాడుతూ ఆయన వ్యాఖ్యానించారు. మారుతి



సుజుకీలో సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు 58% వాటా ఉంది. సుమారు 43 లక్షల వాహనాల సామర్థ్యం గల భారత మార్కెట్లో ఏప్రిల్–సెప్టెంబరు మధ్య కాలంలో మారుతి సుజుకీ వాటా 39 శాతానికి తగ్గింది. రాబోయే కాలంలో 50% మార్కెట్ వాటా తిరిగి సాధించడంతో పాటు విద్యుత్ కార్ల ఉత్పత్తి, ఎగుమతుల్లో నంబర్ వన్ కావాలనుకుంటున్నట్టు సుజుకీ చెప్పారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006